www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 అక్టోబరు 2023
5
ఏలూరు



మహాత్మా.. మన్నించు..!

ప్రజాశక్తి - ముదినేపల్లి

గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం, మాంసం విక్రయాలను నిషేధించింది. అయినా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో మద్యం, మాంసం విక్రయాలు మండలంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా సోమవారం సాగాయి. శ్రీహరిపురం, ముదినేపల్లి, వడాలి, గురజ, సింగరాయపాలెం చిగురుకోట, పెదపాలపర్రు, వైవాక, కొత్తపల్లి తదితర గ్రామాల్లో చికెన్, మటన్ విక్రయాలు అడ్డూఅదుపూ లేకుండా కొనసాగాయి. హోటళ్లకు ఆర్డర్లు ఉన్న దృష్ట్యా చికెన్, మటన్ విక్రయాలు చేస్తున్నామని వ్యాపారులు బహిరంగంగా చెబుతున్నారు. నియంత్రించాల్సిన పంచాయతీ అధికారులు పత్తాలేకుండా పోయారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసినప్పటికీ మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా జోరుగా మద్యం విక్రయాలు జరిగాయి. ప్రభుత్వ దుకాణాలు తెరవనప్పటికీ మందుబాబులకు కొరతలేకుండా మద్యం లభించింది. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మౌనంగా ఉండటం విశేషం.

ఒక్క హామీ.. అమలైతే ఒట్టు..!

- 2019 ఎన్నికల్లో జిల్లాలో వైసిపి వరాల జల్లు
- ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ అమలుకాని పరిస్థితి
- అటకెక్కిన పోలవరం నిర్వాసితుల పరిహారం, వాటర్ గ్రిడ్
- చింతలపూడి ఎత్తిపోతల రైతులకూ అన్యాయమే
- ప్రకటనలతో సరిపెడుతున్న కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం
- తెరుచుకోని చాగల్లు సుగర్ ఫ్యాక్టరీ

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఎన్నికల్లో గెలుపొందడానికి పలు హామీలు గుప్పించడం, ఆ తర్వాత మరిచిపోవడం రాజకీయ పార్టీలకు సర్వసాధారణమైంది. 2019 ఎన్నికల్లో జిల్లా ప్రజలకు అత్యంత అవసరమైన పలుహామీలను వైసిపి గుప్పించింది. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు పూర్తయినప్పటికీ ఏ ఒక్క హామీ కూడా అమలుచేయలేదు. దీంతో మరోసారి మోసపోయామంటూ జిల్లా ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు మరో ఆరు నెల్లలో ఎన్నికలు రానుండటంతో జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టిసారిస్తుందా అన్న చర్చ సైతం నడుస్తోంది.

'మాటతప్పం.. మడమతిప్పం' అంటూ వైసిపి నాయకులు పదేపదే చెబుతున్న మాట. గడిచిన ఎన్నికల్లో జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. 2019 ఎన్నికల్లో జిల్లాలో జరిగిన ప్రధానపాత్ర పోషించిన హామీల్లో ప్రధానమైనది వాటర్‌గ్రిడ్ నిర్మాణం. డెల్టాలోని దాదాపు 25 మండలాల్లో ఈ హామీ తీవ్ర ప్రభావం చూపిందని చెప్పొచ్చు. ఆక్వా చెరువులు పెరిగిపోవడంతో డెల్టాలోని తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. అక్కడి జనం తాగేందుకు గుక్కెడు తాగునీరు లేకుండా పోయింది. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరడం లేదు. దీంతో వైసిపి అధినేత జగన్ తన పాదయాత్రలోగానీ, ఎన్నికల ప్రచారంలోగానీ తాగునీటి సమస్యపైనే ఎక్కువగా మాట్లాడేవారు. వైసిపి అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేస్తామని, గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ల ద్వారా తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత రూ.3,200 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి సైతం చేశారు. తర్వాత డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చావుకబురు చల్లగా చెప్పారు. అయినప్పటికీ కానీ నేటికీ వాటర్‌గ్రిడ్‌కు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో ఇప్పటికీ జనం తాగునీరు కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో జిల్లా ప్రజలకు ఇచ్చిన తాగునీటి వంటి ప్రధాన హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. రాష్ట్రానికి జీవనాడి అని చెబుతున్న పోలవరం ప్రాజెక్టు కోసం సర్వంత్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం పెంచుతామని హామీ ఇచ్చింది. పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలు పెంపుచేసి అందిస్తామని చెప్పింది. 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రధానంగా ఇచ్చిన ఈ రెండు హామీలను కూడా వైసిపి ఇప్పటికీ అమలు చేయలేదు. ఇచ్చిన హామీల అమలు చేయకపోగా పోలవరం నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందించలేదు. దీంతో ప్రతిఏటా వరదలకు పోలవరం నిర్వాసితులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు బతుకులు నెట్టుకొస్తున్నారు. అధికారంలోకొచ్చిన రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామన్న హామీ సైతం అలానే ఉండిపోయింది. కొల్లేరులోకి సముద్రంలోని ఉప్పునీరు చేరకుండా ఉప్పుటేరుపై రెగ్యులేటర్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలంలోని పడితడక వద్ద వీటిని నిర్మిస్తామని ప్రకటించారు. అందుకోసం రూ.400 కోట్లకు పైగా నిధులను సైతం మంజూరు చేసినట్లు చెప్పినప్పటికీ పనులు మాత్రం ఒక్క అడుగు ముందుకు పడలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలంటూ టిడిపి ప్రభుత్వంలో పెద్దఎత్తున నిరసనలు, రిలే దీక్షలు చేశారు. 2019 ఎన్నికల్లో చింతలపూడి బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకొచ్చాక రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకూ ఆ ఊసే లేదు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మూతపడిన చాగల్లు సుగర్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ సుగర్ ఫ్యాక్టరీ తెరచుకోలేదు. కార్మికులకు ఎలాంటి న్యాయమూ జరగలేదు. గత ఎన్నికల్లో రోడ్ల నిర్మాణంపైన వైసిపి పలు హామీలిచ్చింది. ఇప్పటికీ రోడ్ల వ్యవస్థ బాగుపడలేదు. ఇవికాకుండా ఆయిల్‌పామ్, పొగాకు రైతులకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు సైతం సక్రమంగా అమలు చేయలేదు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం జిల్లా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను పక్కకు పెట్టడం జనాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉన్న కొద్దిరోజుల పాలనలోనైనా ఇచ్చిన హామీలను నెరువేరుస్తుందో వేచిచూడాల్సి ఉంది.



సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న గోదావరి వరద బాధితులు (ఫైల్‌ఫొటో)



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకొస్తాం

- జిల్లా జడ్జి పురుషోత్తమకుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- జిల్లా జైలులో ఘనంగా గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా జడ్జి సిహెచ్.పురుషోత్తమ కుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏలూరు జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో గాంధీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కెవివి.బుల్లికృష్ణ, జైలు సూపరింటెండెంట్ సిహెచ్.రవికిరణ్.స్వామి, జైలర్లు కె.వెంకటరెడ్డి, కె.శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలకు సంబంధించిన కేసులను త్వరగా విచారణ విడుదలకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కమ్యూనికేషన్‌లో జాప్యం లేకుండా రిలీజ్ ఆర్డర్ల సత్వరజారీకి చర్యలు తీసుకుం టామన్నారు. రిమాండ్ ఖైదీలకు అవసరమైన ఉచిత న్యాయసహాయాన్ని అందించబడుతుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయసహాయం అందించేందుకు ముగ్గురు న్యాయవాదులను గుర్తించి నియమించామన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవ్యవస్థలో పెద్దఎత్తున మార్పులు రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కోవిడ్-19 అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమవాదనలు వినిపించుకునే అవకాశం సుప్రీంకోర్టు కల్పించిందన్నారు. సమాజానికి ఉపయోగపడే రీతిలో ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు అన్ని రకాలప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఖైదీలను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కింద వారికి నచ్చిన వృత్తుల్లో నైపుణ్యం పొందేందుకు శిక్షణా కార్యక్రమాలు కూడా అమలు చేయబడతాయన్నారు. కుటుంబాన్ని వదలి జైలులో ఒంటరిగా ఉండి కుంగుపాటుకు గురయ్యే వారిని గుర్తించి వారిలో మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు మానసిక వైద్య నిపుణుల సేవలను అందిస్తామన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ అహింసా మార్గానికి గాంధీ ఒక సింబల్‌గా నిలుస్తారన్నారు. సమాజంలో ఉద్రేకపూరిత వాతావరణంలో కానీ ఇతర పరిస్థితుల ప్రభావం వల్లకానీ తప్పులు అందరూ చేస్తారని, అయితే వారిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మార్పు కోరుకునేవారు సమాజంలో మంచి వ్యక్తిగా నిలుస్తారన్నారు. ఖైదీల సంక్షేమం కోసం అమలవుతున్న పలు అంశాలు, సంస్కరణలను ఆయన వివరించారు. జైలు నిర్మాణంలో అనేక సంస్కరణలు తీసుకురావడం ద్వారా జైలు ఒక ఆశ్రమం నిలిచేలా ఖైదీల జీవనశైలిలో మార్పులతో, వారిలో పరివర్తనకోసం ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టాయన్నారు. వృత్తినైపుణ్య కార్యక్రమాలు చేపట్టబడ్డాయన్నారు. ఈ విషయంలో మనరాష్ట్రం నాంధిగా నిలిచిందన్నారు. అంతేకాకుండా ఏదో నేరం చేశామని, కుటుంబానికి దూరంగా ఉంటున్నామని ఒంటరిగా ఉండే ఖైదీ జీవనశైలి, మానసిక ప్రవర్తన మార్చేందుకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఇందుకోసం ఎన్‌జిఒల సహకారం తీసుకోవడంతో పాటు మానసిక వైద్యుల సేవలను కూడా అందిపుచ్చుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి మానసిక వైద్యులను పంపుతామని చెప్పారు. అదే విధంగా నషాముక్తా భారత్ అభియాన్ కింద మారకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఇలాంటి వాటి జోలికి వెళ్లకుండా ఖైదీల్లోకూడా పరివర్తన తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవివి.బుల్లికృష్ణ మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కింద రిమాండ్ ఖైదీలకు న్యాయసహాయాన్ని ఉచితంగా డిఎల్ ఎస్‌ఎ తరపున అందిస్తున్నామన్నారు. తరచూ తాము జైలును సందర్శించి ఖైదీలకు ఉచిత న్యాయసహాయం అందించడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. యూటిఆర్‌సి కింద ఈనెలలో నాలుగుసార్లు సమావేశాలు నిర్వహించామన్నారు. ఇప్పటికే రూ.25 లక్షల విలువైన ఉచిత న్యాయ సహాయం అందించామన్నారు. మహిళా బ్లాక్‌లో బేకరీ ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం రూపొందించామన్నారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. అనంతరం నాట్యాచార్య డి.హేమసుందర్ శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌ఎస్‌ఎ డిఫెన్స్ న్యాయ వాదులు పివిఎన్.మునేశ్వరరావు, బి.రామ్మోహన్, టి.మధు, ఫామిలీ వెల్ఫేర్ న్యాయవాదులు కూన వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ఖండిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మహిళలపై దాడులను అత్యాచారాలను, ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.భారతి, కురసం లత మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలపై, బాలికలపై రోజురోజుకూ అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. నాడు సనాతన ధర్మం మహిళలను వంటింటికే పరిమితం చేస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం మహిళలు నేడు జనజీవన స్రవంతిలోకి వచ్చి చదువుకుని ఉద్యోగాలు చేస్తుంటే సమాజంలోని కొన్ని మానవమృగాల వల్ల భయపడాల్సి వస్తుందన్నారు. అనేక రక్షణ చట్టాలు తెచ్చినా ప్రభుత్వాలు వాటిని పటిష్టంగా అమలు చేయడం లేదన్నారు. మహిళలపై నిత్యం అత్యాచారాలు, హత్యలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. గాంధీ ఆనాడు ఎప్పుడైతే మహిళ అర్ధరాత్రి 12 గంటలకు నిర్భయంగా రోడ్లపై తిరుగుతుందో అప్పుడే ఈ దేశానికి స్వాతంత్రం వచ్చినట్లు అని అన్నారు. కానీ నేడు పట్టపగలు ఒక మహిళ రోడ్డుపైకి రావడానికి భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఈ ర్యాలీ బస్టాండు, నెహ్రూ బొమ్మ సెంటర్, తహశీల్దార్ కార్యాలయం మీదుగా హైస్కూల్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కారం లక్ష్మి, ఎం.దుర్గ, వెంకటలక్ష్మి, పోచమ్మ, శకుంతల, గోగుల పద్మ, సంధ్య, బుల్లెమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టిసి పోర్టర్స్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి లైసెన్సెడ్ పోర్టర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కొత్తబస్టాండ్ ఆర్‌టిసి కార్గో పాయింట్ వద్ద సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో పోర్టర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎపిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత సంస్థలో అధికారులు ప్రభుత్వ ఉద్యోగులుగా మార్పు చెందారు కానీ ఆర్‌టిసి సంస్థలో కీలకమైన కార్గో విభాగంలో పనిచేస్తున్న ఆర్‌టిసి లైసెన్సెడ్ పోర్టర్స్ సమస్యలు ఇంకా అలానే ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి లైసెన్స్‌డ్ పోర్టర్స్‌ను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, పని భద్రత కల్పించాలని, ఆర్‌టిసి లైసెన్స్‌డ్ పోర్టర్స్‌కు ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, రిటైర్డ్ ఆర్‌టిసి లైసెన్స్‌డ్ పోర్టర్స్‌కు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. పోర్టర్స్ ఏలూరు శాఖ గౌరవ అధ్యక్షులు ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ పోర్టర్స్ అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని, లైసెన్స్ రెన్యువల్స్‌లో కూడా ఇబ్బందులున్నాయని, తక్షణం అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైసెన్స్‌డ్ పోర్టర్స్ తమ్మిశెట్టి రమణయ్య, గుంజే వెంకటేష్, దాసిపల్లి ఆదినారాయణ, చంద్రగిరి ప్రశాంత్ పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి కానిస్టేబుల్ మృతి

గతనెల 30న గణేష్ నిమజ్జనంలో ఘర్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలో ఇటీవల గణేష్ నిమజ్జనం సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన కానిస్టేబుల్ గంధం నరేంద్ర(34) పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లి గౌడ బజారులో గతనెల 30వ తేదీ గణేష్ నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఊరేగింపు బాగా ఆలస్యం కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న గంధం నరేంద్ర త్వరగా నిమజ్జనం చేయాలంటూ నిర్వాహకులను వారించారు. అప్పటికే అర్ధరాత్రి దాటడంతో డిజె సౌండ్స్‌ను ఆపివేయాలని కోరారు. దీంతో అక్కడే ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ ఉలాస రామకృష్ణ కానిస్టేబుల్‌తో వాగ్వివాదానికి దిగాడు. ఆనంతరం కానిస్టేబుల్ ఒంటరిగా ద్విచక్రవాహనంపై ఉన్న సమయంలో తలపై కర్రతో బలంగా కొట్టడంతో నరేంద్ర అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ చంటిబాబు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని నరేంద్రను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. నిందితుడు రామకృష్ణపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నరేంద్రకు భార్య, కుమారుడు, కుమార్తె(8 నెలలు) ఉన్నారు. నరేంద్ర స్వగ్రామం తిరువూరు మండలం, పూలశెట్టిపాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన నరేంద్ర 2018 పోలీస్ బ్యాచ్‌కి చెందినవారు. చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల ఆగిరిపల్లికి బదిలీ అయ్యారు. నరేంద్ర మృతికి ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



నరేంద్ర (ఫైల్‌ఫొటో)

ఒపిఎస్ సాధనే లక్ష్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన వైసిపి ప్రభుత్వం నిలబెట్టుకోకుండా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిపిఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీం) అంటూ ఉద్యోగులను మోసం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖండవల్లి గిరిబాబు భూపతి, రామారావు అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిపిఎస్ వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సిపిఎస్ తీసుకురావడమే అన్యాయమని, దానిపై ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులు ఉద్యమిస్తుంటే నేడు జిపిఎస్ పేరుతో తిరిగి మోసం చేసే కుట్రలు ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు భరోసా ఇస్తుందని, జిపిఎస్‌ను అంగీకరించేదిలేదన్నారు. ఒపిఎస్ సాధించేవరకూ పోరాటం ఆగదని పిలుపునిచ్చారు. ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీకి కట్టుబడి సిపిఎస్‌ను వెంటనే రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి, డిఎ బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి కెఎస్‌వి.లోవకుమారి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కలపర్తి రాజా, కోశాధికారి కలపర్తి శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కార్యదర్శి కాటంరాజు, కామవరపుకోట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రఘునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు

విఆర్‌ఎలను విస్మరించడం తగదు

ప్రజాశక్తి - కుక్కునూరు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని, వారికి సంబంధంలేని పనులు చేయించకూడదని విఆర్‌ఎల సంఘం(సిఐటియు) జిల్లా అధ్యక్షులు బ్రహ్మాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విఆర్‌ఎల సంక్షేమ యూనియన్ సమావేశం కొండపల్లి గ్రామంలో వెంకన్నబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బ్రహ్మాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఆర్‌ఎలను పార్ట్ టైం ఉద్యోగులు అని చెబుతూ 24 గంటలు పని చేయించుకుంటూ చాలీచాలని వేతనాలతో తీవ్రఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. విఆర్‌ఎలకు సంబంధం లేని పనులు చేయిస్తూ, తరుటూ ఆఫీసులకు పిలిపిస్తున్నారని, నైట్‌వాచ్‌మెన్ విఆర్‌ఎలతో భర్తీ చేయాలని కోరితే అది చేయకుండా విఆర్‌ఎలతో డ్యూటీలు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. నామిని విఆర్‌ఎలతో పనిచేయించుకుంటూ వారి క్షేమాన్ని పట్టించుకోకుండా ఉండటం సరికాదన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాలేదనిన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక విఆర్‌ఎలకు ఒక్క రూపాయి పెంచకపోగా ఉన్న డిఎను కూడా కోత విధించిందన్నారు. డిఎ రికవరీ ఆపాలని పలుమార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఏ మాత్రమూ కనికరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోగా ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని విమర్శించారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ 154వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సమావేశంలో విఆర్‌ఎల యూనియన్ జిల్లా కోశాధికారి గంగాధర్, మండల కోశాధికారి కాకర్ల శ్రీను, విఆర్‌ఎలు గడిదేశి శంకర్, భూక్యా చందు, వి.శివ, ముత్తేష్, బాడిస రాధ, గోలి మారుతి, కె.మోహన్‌రావు, ఇరకం రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మాజీ

'స్వచ్ఛ తా హి సేవ'లో ఏలూరు రికార్డ్

ఏలూరు టౌన్: 'స్వచ్ఛత తా హి సేవ' కోసం ఐదు వేల మందితో ఏర్పాటు చేసిన మెగా సెల్ఫీ క్యాంప్ రికార్డు సృష్టించి 25 వేల మందితో విజయవంతమైంది. ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఏలూరు నగరపాలక సంస్థ సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ద్వారా అవార్డులను అందుకున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత హి సేవ పై అవగాహన కల్పించే మెగా క్యాంప్‌ను అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో నిర్వహించారు. మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొన్నారు. గంటపాటు ఈ కార్యక్రమం జరిగింది. ఇప్పటి వరకూ 4500 మందితో ఉన్న సెల్ఫీ రికార్డును ఏలూరు నగరపాలక సంస్థ స్వచ్ఛత అనే మంచి సత్సంకల్పంతో దాటి వెళ్లిందన్నారు. ఈ మూడు రికార్డులను సొంతం చేసుకోవడం ద్వారా త్యాగమూర్తి గాంధీకి ఏలూరు నగర ప్రజలిచ్చే నివాళిగా నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అభివర్ణించారు.

నేడు 28 గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లావ్యాప్తంగా ఈనెల మూడో తేదీన 28 గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. ఏలూరు మండలంలో ఎంఆర్‌సి కాలనీ-2, యుపిహెచ్‌ఎస్‌లో, ముదినేపల్లి మండలం ఊటుకూరు, వేలేరుపాడు మండలంలో కట్కూరు, కామవరపుకోట మండలంలో తడికలపూడి, జీలుగుమిల్లి మండలంలో పి.రాజవరం, ముసునూరు మండలంలో అక్కిరెడ్డిగూడెం, పెదపాడు మండలంలో ఏపూరు-1, నూజివీడు మండలంలో గొల్లపల్లి-2, భీమడోలు మండలంలో గుండుగొలను పిహెచ్‌సి పరిధిలో భీమడోలు-1, కుక్కునూరు మండలంలో మాదారం, బుట్టాయగూడెం మండలంలో అంతర్వేదిగూడెం పిహెచ్‌సి పరిధిలో బుట్టాయగూడెం-2, చాట్రాయి మండలం చనుబండ-1, కలిదిండి మండలంలో కొట్బెర్ల, టి.నరసాపురం మండలంలో కేతవరం, లింగపాలెం మండలంలో ఆసన్నగూడెం, ద్వారకాతిరుమల మండలంలో గుండుగొలనుకుంట, ఏలూరు మండలంలో మాదేపల్లి, మండవల్లి మండలంలో భైరవపట్నం, కొయ్యలగూడెం మండలంలో బోడిగూడెం, పోలవరం మండలంలో ఎల్‌ఎన్‌డి పేట పిహెచ్‌సి పరిధిలో గూటాల-1,

చంద్రబాబు అరెస్టుపై టిడిపి నేతల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ చేపట్టిన నిరసన దీక్షలు సోమవారమూ కొనసాగాయి. టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబుకు మద్దతుగా సత్యమేవ జయతే దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతకాల బోర్డుపై రక్తంతో సంతకాలు చేసి చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంఎల్‌ఎ గంటా మురళీ, టిడిపి సీనియర్ నాయకులు ముత్తారెడ్డి, సాయల సత్యనారాయణ, రావూరి కృష్ణ, కుక్కల మాధవరావు, కోనేరు సుబ్బారావు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులు మౌనదీక్ష

ముదినేపల్లి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ముదినేపల్లిలో గాంధీ జయంతిని పురస్కరించుకుని టిడిపి నేతలు మౌన దీక్ష చేపట్టారు. నియోజకవర్గ టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు కట్టుకుని స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ గాంధీ జయంతిని పురస్కరించుకుని శాంతిమార్గంలో ప్రభుత్వం అవలంభిస్తున్న కక్షపూరిత విధానంపై నిరసన తెలిపామన్నారు. తప్పు చేయని చంద్రబాబుపై అక్రమంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపిన వైసిపి ప్రభుత్వాన్ని త్వరలో ప్రజలు బంగాళాఖాతంలో కలిపివేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పంతగాని సురేష్, బత్తుల రవి, నంగెడ్డ రాఘవేంద్రరావు, సిహెచ్.రాము, శ్రీరామ్ పాల్గొన్నారు.

ముసునూరు : గాంధీ జయంతి సందర్భంగా స్థానిక మండపం సెంటర్ వద్ద మొదటిగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపటిటన దీక్షలో గద్దే రఘుబాబు, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మసిముక్కు సుబ్బారావు, లక్కపాము కాంతారావు, చలమాల వెంకటేశ్వరరావు పర్వతనేని వెంకటేశ్వరరావు, మానం ఘంటేశ్వరరావు, పలువురు టిడిపి నాయకులు ఈ దీక్షలో పాల్గొని గాంధీకి చంద్రబాబు తప్పు చేయలేదంటూ వినతిపత్రం అందజేశారు.

మండవల్లి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భైరవపట్నం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో మాజీమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడడం తప్ప, రాష్ట్రాభివృద్ధిని, ప్రజల శ్రేయస్సును పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమిలి విఠల్‌రావు, కైకలూరు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో రక్తంతో సతకాలు చేస్తున్న నాయకులు

చాట్రాయి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి గాంధీ జయంతిని పురస్కరించుకుని కాకినాడలో చేపట్టిన సత్యమేవ జయతే నిరాహార దీక్షకు మద్దతుగా చనుబండ, పోలవరం, చీపురుగూడెం గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు కూర్చున్నారు. పోలవరంలో ఎర్ర హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో, చీపురుగూడెంలో ఎం.జగదీష్ ఆధ్వర్యాన దీక్షలు చేపట్టారు. ఆయా దీక్షల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మతోన్మాద బిజెపి విధానాలు తిప్పికొట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దేశంలోని మతోన్మాద బిజెపి విధానాలు తిప్పికొట్టాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో పార్టీ ముఖ్య కార్యకర్తల క్లాసులు సోమవారం మండలంలోని జైనవారి గూడెంలో ప్రారంభమైయ్యాయి. ఈ క్లాసులు సూచికగా పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు కారం మల్లేశ్వరరావు జెండా ఎగరవేసి క్లాసులు ప్రారంభించారు. అనంతరం లింగరాజు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద విధానాలు చాప కింద నీరు లాగా ప్రవశిస్తున్నాయని, ప్రజల్లోని మత విద్వేషాలు రెచ్చగొట్టి చీలికలు తీస్తున్నాయని వారు విమర్శించారు. మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాల్ని ప్రజలు తిప్పి కొట్టే విధంగా సిద్ధం కావాలని కోరారు. ఈ క్లాసుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మొడియం నాగమణి, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నాయకులు తెల్లం దుర్గారావు, మానుకొండ జీవరత్నం, గూడేల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉంచిన కానిస్టేబుల్ గంధం నరేంద్ర మృతదేహాన్ని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలీసుల దాడులను ఖండించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ ఇంటిపై పోలీసుల దాడులు ఖండించాలని పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది బాషా శ్యాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటలకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదైన నంబూరి శ్రీమన్నారాయణ ఇంటి మీద కొవ్వూరులో పోలీసులు దాడిచేసి, సోదాలు నిర్వహించి, కుటుంబ సభ్యులను నిర్బంధించటం అప్రజాస్వామికం అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముంచింగుపుట్టు, గురజాల కేసులను వాదిస్తున్నందుకు న్యాయవాది శ్రీమన్నారాయణపై మీరు ఎలా నిర్బంధం విధిస్తారని ఆయన ప్రశ్నించారు. న్యాయవాదులపై తప్పుడు కేసులు బనాయిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఎంఎల్ఎకు సత్కారం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఎంఎల్ఎను నియోజకవర్గ మండల కన్వీనర్లు సోమవారం సత్కరించారు. ఆదివారం సాయంత్రం ఎంఎల్ఎలు కలిసి మండల కన్వీనర్లను సత్కరించారు. మండలాలకు కన్వీనర్లుగా నియమించినందుకు ఎంఎల్ఎకి సాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం, పోలవరం, వేలేరుపాడు నుంచి పాల్గొన్నారు

సుక్ పాల్ సింగ్ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పంజాబ్ ఫ్లోర్ లీడర్, స్థానిక ఎంఎల్ఎ సుక్‌పాల్ సింగ్ కైరా అక్రమ అరెస్టును ఖండించాలని కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు తెలిపారు. సోమవారం స్థానిక జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సుక్పల్ సింగ్‌కు ఊరట కలిగించినప్పటికీ, ఈడీ కేసు నుంచి విముక్తి లభించిన ఆప్ నేతృత్వంలోని భగవత్‌సింగ్ మాన్ సర్కార్ కక్ష సాధింపు చర్యలో భాగంగా సుక్ పల్ సింగ్‌ని అరెస్టు చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, ముద్దాల ప్రసాద్, హీరా హకీం, గోపిశెట్టి ప్రసాద్, ప్రగళ్లపాటి కాశి, వీరవల్లి సోమేశ్వరరావు, తాడేపల్లి ఉమా పాల్గొన్నారు.

నేడు పలు డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 41, 45, 46, 48, 49, 50 డివిజన్లకు సంబంధించి 6 సచివాలయాల పరిధిలోని జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు ఈనెల 3న ఉదయం 9 గంటలకు 49వ డివిజన్ జంగారెడ్డిగూడెం రోడ్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్నామని మేయర్ నూర్జహాన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ ఆళ్ల నాని, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కార్పొరేటర్లు పాల్గొంటారన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అందరూ తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

వికలాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందజేయడం ద్వారా వారిలో ఆత్మ విశ్వాసంను పెంపొందిచవచ్చునని ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి వి.వారణాశి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్ నందు ఆధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం విజయవాడ రీజియన్ ఆధ్వర్యంలో పలువురు వికంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. అనంతరం హీల్ చిల్డ్రన్ హోమ్ నందు 850 మంది విద్యార్థులకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జనరల్ మేనేజర్ జిఎస్‌వి కృష్ణారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వి.జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

'వర్గీకరణకు కృషి'

ప్రజాశక్తి - చింతలపూడి

నాయిబ్రాహ్మణ సోదరులంతా ఐకమత్యంతో కలిసి మెలిసి అందరూ ముందుకు వెళ్లాలని, అలాగే ప్రతిఒక్కరు ఎ,బి,సి,డి వర్గీకరణకు కృషి చేయాలని నాయిబ్రాహ్మణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు తెలిపారు. రాబోయే రోజుల్లో రాజకీయంగా ఎదగాలి అంటే ఎబిసిడి వర్గీకరణ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొప్పాక వెంకటేశ్వరావు, స్టేట్ సెక్రెటరీ కొప్పాక వీర వెంకట సత్యనారాయణ, జిల్లా నాయకులు ఆచంట శ్రీనివాసరావు, లింగపాలెం మండలం అధ్యక్షులు కొప్పాక పాండు, మండల సెక్రెటరీ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

వారాహి యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న వారాహి యాత్రను జయప్రదం చేయాలని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేక ఈశ్వరయ్య పిలుపు నిచ్చారు. సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. వారాహి యాత్ర నాలుగో విడతలో భాగంగా కృష్ణా జిల్లా అవనిగడ్డలో నిర్వహించే భారీ బహిరంగ సభలో చింతలపూడి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు - ఘోరాలు


పట్టిసీమ కాలువలో వృద్ధుడు గల్లంతు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడి గ్రామ శివారు పోలవరం పట్టిసీమ కాలువలో సోమవారం ప్రమాదవశాత్తు కాలుజారి సిరిపురపు సన్యాసిరావు(62) అనే వృద్ధుడు కొట్టుకుపోయినట్లు రూరల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సన్యాసిరావు కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఘనంగా గాంధీ జయంతి

జిల్లా వ్యాప్తంగా మహాత్ముడి జయంత్యుత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, వైద్యులు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ చేసిన కృషిని పలువురు కొనియాడారు. నేటి యువత గాంధీ ఆశయాలకనుగుణంగా ముందుకుసాగాలని కోరారు. గాంధీ కలలుగన్న సమాజ స్థాపనకు నేటి పాలకవర్గం కృషి చేయాలని పలువురు సూచించారు.


టి.నరసాపురంలో..

ప్రజాశక్తి - చింతలపూడి

ఏళ్ల నాటి నుంచి ఉన్న జర్నలిస్టుల సమస్యలకి ప్రభుత్వం పరిష్కారం చూపాలని చింతలపూడి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఆజాద్ కోరారు. అర్హులైన జర్నలిస్టులకి ఇంటి స్థలాలు, కరోనాతో మృతి చెందిన జర్నలిస్టులకు నష్ట పరిహారం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పిలుపు మేరకు సోమవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి, సీనియర్ పాత్రికేయులు అమీర్ పాషా, వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి జర్నలిస్ట్ సమస్యలపై వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు జిన్నా, ముత్తేశ్వరరావు, నరేష్, నత్త వెంకటేశ్వరరావు, కిరణ్, చిన్ని, ప్రతాప్, సతీష్, అశోక్, సంజయ్, సునీల్ పాల్గొన్నారు.

సివిల్ కోర్టు జూనియర్ న్యాయమూర్తి సి.మధుబాబు గాంధీకి నివాళులర్పించారు. సబ్ జైలును సందర్శించి, వారి కేసుల వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

మండవల్లి : మహాత్మా గాంధీ 154 జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఇండియన్ బ్యాంకులో మహాత్ముని చిత్రపటానికి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, కె.సూర్యారావు, బండి రంగారావు, ఫీల్డ్ ఆఫీసర్ బి.రాజేష్, వర్షిత్, ప్రేమ పాల్గొన్నారు.

గాంధీ సేవాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అగస్తి ఆదివిష్ణు, సర్పంచి మెండ జాన్సీ, సొసైటీ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ కాకొల్లు రాజు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాంబాబు, గంగాధర్, సంజయ్ స్వామి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : గాంధీ జయంతి సందర్భంగా కొయ్యలగూడెం బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

చాట్రాయి : గాంధీ 154వ జయంతి సందర్భంగా చాట్రాయి పిహెచ్‌సిలో సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ రక్త పరీక్ష శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి ప్రారంభించగా డాక్టర్ ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి పారిశుధ్య కార్మికులకు, క్లాసు మిత్రులకు క్రియేటివిటీ, థైరాయిడ్, లివర్ సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మురళీమోహన్, పిఒపిఆర్‌డి మురళీకృష్ణ, కార్యదర్శి నాగరాజు, దామెర ప్రసాద్ బాబు, ఎంపిటిసి సంకు శివకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : గాంధీ వల్లే ఈ దేశానికి స్వాతంత్రం వచ్చిందని తహశీల్దార్ ఎం.సుందరరాజు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలోను గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ రూజ్‌వెల్ట్, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గాంధీ ఆశయాలను నేటితరం ఆచరించాలని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి తెలిపారు. గోపీనాథపట్నం సచివాలయంలో సర్పంచి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి అధ్యక్షతన గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిల్లా చరణ, మేకల అనిల్, షేక్ గబ్బర్, కొంగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగు యువత, తెలుగు మహిళ నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని రావిచర్ల గ్రామంలో మాజీ ఎఎంసి ఛైర్మన్, గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శాఖాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

టి.నరసాపురం : గాంధీజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేతవరం ఉప సర్పంచి భీమవరపు జగన్మోహన రావు, అగ్నిపర్తి భిక్షమయ్య, వంటిపల్లి సుబ్రహ్మణ్య, జయ్యవరపు శ్రీనివాసరావు, జయ్యవరపు వెంకటేశ్వరరావు, అద్దంకి రాంబాబు, పంతగాని సోమరాజు, మొగులోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని శ్రీహరిపురం, సింగరాయపాలెం, ముదినేపల్లి తదితర గ్రామాల్లో ఉన్న మహాత్మగాంధీ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీహరిపరం గాంధీ ఆశ్రమం, సిగరాయపాలెం పంచాయతీ వద్ద ఉన్న గాంధీ విగ్రహాలకు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించగా, ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫణింద్ర, నాగలక్ష్మి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : గాంధీ కలలుగన్న సమాజం ఏర్పాటుకు గ్రామాలు పూర్తిగా అభివృద్ధి చెందాలని లక్కవరం గ్రామపంచాయతీ సర్పంచి గెల్లా వెంకటరమణ తెలిపారు. గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి నిమ్మల రామకృష్ణ, వార్డు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీలుగుమిల్లి : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కెఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స.పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, సూపరింటెడెంట్ మంగతాయారు, ఈఒపిఆర్‌డి నిఖిల్ మధు చరణ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవి, జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు పాల్గొన్నారు.

పోలవరం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం టౌన్ అధ్యక్షులు, ఎంపిటిసి నీలి సుమన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షులు చక్కా జగన్మోహనరావు, సంఘ నాయకులు పలివెల ప్రకాశరావు, మానేపల్లి రామలింగేశ్వరరావు, వాయుగుండ్ల రాంబాబు, సమయమంతుల ప్రసాద్, యువ సంఘ నాయకులు వూర ఆకాష్, నీలి జయప్రకాష్, పెరుమాళ్ల నాగేంద్ర పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఏలూరు టౌన్ : గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఏలూరు నగర నాయకులు కొల్లి ఈశ్వర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కింజింగి రాజు, ప్రచార కార్యదర్శి వి.కిషోర్, అడ్వకేట్ ఆచంట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

రివర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోల్లాయిగూడెం కాలనీలో ట్రస్ట్ నందు ట్రస్ట్ ఛైర్మన్ అయినా కాటూరి సుధాకర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గౌడ్ రంగబాబు, నగర కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

ముసునూరు : రమణక్కపేట సచివాలయంలో గాంధీ జయంతి వేడుకలు సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, ఎంపిటిసి కోండా వెంకట్రావ్ దుర్గభవానీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణీ, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సూపర్‌డెంట్ కూచిపూడి సాయిరామ్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : గాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి బొలినేని ప్రసాద్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా జగనన్న స్వచ్ఛ సంకల్పంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపిడిఒ కెఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల పరిధిలో పనిచేసే సిబ్బందికి జీలుగుమిల్లి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మొత్తం 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, సర్పంచి చీర్రి జగదాంబ, వైద్య సిబ్బంది గాయత్రి, సిహెచ్ఒ శ్రీనివాసరాజు, మంగ, పంచాయతీ కార్యదర్శులు దేవప్రియుడు, అశోక్, సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి వైద్య సేవలందించడం ఎంతో గర్వకారణమని ఎంపిడిఒ జి.రాణీ తెలిపారు. సోమవారం మండలకేంద్రమైన ముసునూరులో గాంధీజీ జయంతి సందర్భంగా పిహెచ్‌సి వద్ద క్లాప్ మిత్ర వైద్య శిబరం నిర్వహించి, వారికి ఉచితంగా వైద్యం అందించి, మందులు అందజేశామని వైద్యులు యం.కిరణ్‌కుమార్, కరిముల్లాలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం అదే పాఠశాలలో సోమవారం నిర్వహించారు. 103 మంది మిత్రులకు గానూ 96 మంది వరకూ హాజరయ్యారు. రెండు దశాబ్దాల అనంతరం వారంతా కలుసుకుని క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఆనాటి గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు వితరణ అందించారు.

సీనియర్ సిటిజన్ సర్వేశ్వరరావుకు సన్మానం

చింతలపూడి : సిపిఎ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద 'సీనియర్ సిటిజన్స్ డే' సందర్భంగా పాక సర్వేశ్వరరావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పాక సర్వేశ్వరరావుకు సన్మానం చేయడానికి ముఖ్య ఉద్దేశం ఆయన 58 సంవత్సరాల వయస్సు వరకు పోలీసు ఉద్యోగాన్ని నిర్వర్తించి, రిటైర్మెంట్ అయ్యి 15 సంవత్సరాలు దాటినా ప్రజా సమస్యలపై చింతలపూడిలో ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేకుండా, తన శక్తి కొలది నేటి వరకు కృషి చేస్తున్నారన్నారు. అందుకే ఆయన్ని సన్మానించడం ఉత్తమమని సిపిఎం భావించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ ఎస్.సూర్య కుమార్, తోటి మిత్రులు కక్కిరాల వెంకటేశ్వరరావు, కురిసేట్టి తిలక్ తదితరులు సర్వేశ్వరావు సేవలను కొనియాడారు. అనంతరం సర్వేశ్వరరావును శాలువాతో సత్కరించి 'హలం-కలం' పుస్తకాన్ని బహుకరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గడ్డ నాగేశ్వరరావును సోమవారం జంగారెడ్డిగూడెం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వీరితో పాటు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జువాలజీ సబ్జెక్టు పిజిటి గుర్రం గంగాధరరావు, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వేగవరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తలారి అమృతరావులను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. సోమవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి కనపర్తి రాజా అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖండవల్లి గిరిబాబు, భూపతి రామారావులు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా అమూల్యమైన సేవలందిస్తూ, అవార్డులు సాధించి, ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన ఉపాధ్యాయులను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, జిల్లా మహిళా కార్యదర్శి కెఎస్‌వి లోవా కుమారి, మండల కోశాధికారి కలపర్తి శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కార్యదర్శి కాటంరాజు, కామవరపుకోట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్సే శ్రీనివాసరావు, రఘునాథ్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్లు అందజేత

ఆగిరిపల్లి: మండల పరిధిలోని అడవినెక్కలంలోని సుదీక్షణా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో, మహిళా కుట్టు శిక్షణా కేంద్రలో శిక్షణ పొందిన 38 మంది మహిళలకు ఎంపిడిఒ పి.శంకరరావు సర్టిఫికెట్స్‌ను, ఉచితంగా కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడవినెక్కలం గ్రామ సర్పంచి వేము రాజు, వెంకట కృష్ణ గుత్తా పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటానికి అందరూ సహకరించాలని చింతలపూడి నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు తెలిపారు. ఆయన తపన ఫౌండేషన్ ఛైర్మన్ తపన చౌదరిని నగర పంచాయతీ పరిధిలో చెత్తను సేకరించేందుకు రిక్షాలు కావాలని కోరగా, తపన చౌదరి తన సొంత నిధులతో ఆరు చెత్తను సేకరించే రిక్షాలను పంచాయతీకి బహుకరించారు. అనంతరం తపన చౌదరి మాట్లాడుతూ దేశమంతటా స్వచ్ఛభారత్ నినాదంతో ప్రధానమంత్రి మోడీ నగరాలు, పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా నా వంతు సహాయ సహకారాలు పంచాయతీ వారికి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు విక్రమ్ కిషోర్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు చిదరాల, మధుబాబు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేయటం ఎంతో ఆనందంగా ఉంటుందని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామచౌదరి తెలిపారు. కొవ్వురుగూడెం ముత్యాలమ్మ తల్లి గుడికి తపన చౌదరి తపన పౌండేషన్ ద్వారా రూ.50 వేలు -విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు, టిడిపి నాయకులు అంకంరాజు పాల్గొన్నారు.



చెత్తను సేకరించే రిక్షాలను అందజేస్తున్న తపన ఫౌండేషన్ ఛైర్మన్

పారిజాత గిరిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా సందర్శించారు. సోమవారం ఆలయానికి వచ్చిన న్యాయమూర్తి మల్లికార్జునరావుకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆయన కుటుంబంతో పాటు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కిషోర్ కుమార్, ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి మాణిక్యాల రాంబాబు, స్థానిక ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.